క్లుప్తంగా

టైలర్స్ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రఫీ



రఫీని అభినందిస్తున్న సంఘ నాయకులు

పుత్తూరు: నవ్యాంధ్ర టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎస్.కె.మహమ్మద్ రఫీ నియమితులయ్యారు. ఆదివారం ఏర్పాటైన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో పుత్తూరు నుంచి మహమ్మద్ రఫీకి అవకాశం కల్పించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు విక్కి నాగేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాన్ని రఫీకి అందజేశారు. ఆయనను కౌన్సిలర్ నరసింహారావు, స్థానిక శ్రీలక్ష్మీ వినాయక టైలర్స్ సంఘ నాయకులు అభినందలు తెలిపారు.

నేడు శ్రీకృష్ణభగవాన్ విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న స్వాములు

నిండ్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో శ్రీ మహాలక్ష్మి ఆలయం వద్ద సోమవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం సుప్రభాతసేవ, వేదపారాయణం, కలశ పూజ నిర్వహించారు. సాయంత్రం పూర్ణాహుతి, సుదర్శన మూలమంత్ర హోమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పుండరీక వరదానందస్వామి, విద్యాస్వరూపనంద గిరి స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో ప్రదోషకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రదోష కాల పూజలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శివుడికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరునికి పాలు, పెరుగు, పుసుపు, కుంకుమ, విబూదితో అభిషేకించి పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

ఆకట్టుకున్న బండికుంభాలు

వెదురుకుప్పం: మండలంలోని మొరవ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బండి కుంభాల కార్యక్రమం ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి సుమతిచే హరికథ కాలక్షేపం జరిగింది. సాయంత్రం బలికూడుతో బకాసురుని వేషధారి ప్రదర్శనగా వెళ్లి ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు.

అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన వధ ఘట్టంలో ఓ సన్నివేశం

గంగాధరనెల్లూరు : మండలం పరిధిలోని బాలగంగానపల్లిలో శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ మూర్తులను అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. దుర్యోధన వద ఘట్టం ఆహుతులను ఆకట్టుకుంది. దుర్యోధనున్ని గంగ మడుగు నుంచి భీముడు బయటకు రప్పించే సన్నివేశాన్ని కళాకారులు రక్తి కట్టించారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కన్నికలమ్మకు పూజలు

పాలసముద్రం : మండలంలోని కృష్ణజమ్మపురం కట్టకింద వెలసిన కన్నికలమ్మకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు చేపట్టి, మధ్యాహ్నం అంబలి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం సర్పంచ్ ఆండాల్‌రవి ఉభయదారులు తీసుకొచ్చిన పూజసామగ్రితో అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజ, దీపారాదన చేశారు. పుత్రసంతానం, మాంగళ్యభాగ్యం కోసం మహిళలు పిండి దీపాలు వెలిగించి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

మీ ఆడబిడ్డను మళ్లీ ఆశీర్వదించండి



మంత్రి రోజా ఫేస్ మాస్కులు ధరించిన మహిళలు

- నగరి నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడండి
- టీడీపీ మాయలో పడవద్దు
- భవిష్యత్‌లో బాగుండాలంటే వైఎస్సార్‌సీపీని ఆదరించండి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఆర్‌కే రోజా



పుత్తూరు మండలంలోని వీఎస్ఎస్‌పురంలో గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: 'మీ ఆడబిడ్డనూ భావించి నన్ను గతంలో రెండుసార్లు గెలిపించారు. మీకు సేవ చేశా.. మళ్లీ ఆశీర్వదించి, నగరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి'' అని పర్యాటక సాంస్కృతిక యువజన క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా అభ్యర్థించారు. ఆదివారం పుత్తూరు రూరల్ మండల పరిధిలోని వీఎస్ఎస్‌పురం, టీఆర్‌కండ్రిగ, ఎస్సీ, ఎస్టీ గ్రామాలు, జగన్నాథపురం ఎస్టీ కాలనీ, వేణుగోపాలపురం, రంగుంట ఎస్టీ కాలనీల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మధ్యాహ్నం మిట్టపాళెం గ్రామంలో అందరితో కలిసి భోజనం చేశారు. అనంతరం చంద్రప్పనాయుడు కండ్రిగ, తడుకు, దళితవాడ, తిమ్మరాజుకండ్రిగ, ఎస్టీ కాలనీ, మజ్జిగ గుంట, ఎస్టీ కాలనీ, ఎగువ గూళూరు, సుబ్బారెడ్డి కండ్రిగ వడ్డిండ్లలో రాత్రి వరకు ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో మేళతాళాలతో మంత్రికి హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు.

ప్రజల నోట పథకాల మాట..

ఎన్నికల ప్రచారం నిమిత్తం గ్రామాల్లో పర్యటించిన మంత్రి రోజాకు ప్రజల నుంచి వినూత్న రీతిలో స్పందన వచ్చింది. మంత్రి రోజా కన్నా మహిళలే ముందుగా మాట్లాడుతూ ''మాకు ఆసరా అందింది.. అమ్మఒడి వచ్చింది.. చేయూత ఆదుకుంది.. ఆరోగ్యశ్రీ అండగా ఉంది.. అందుకే మేము ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తాం'' అని చెప్పారు. దీంతో మంత్రి రోజా ఆశ్చర్యపోయారు.

పార్టీలో చేరిక

పుత్తూరు మండలంలోని తడుకు పంచాయతీ వార్డు మెంబరు శివయ్య ఆదివారం మంత్రి రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. స్థానిక నాయకుడు ప్రభురాజు ఆధ్వర్యంలో శివయ్య పార్టీలో చేరారు.

బాబు మాటలు నమ్మవద్దు..

ఎన్నికల సమయంలోనే టీడీపీ నేత చంద్రబాబుకు ప్రజలు గుర్తుకు వస్తారని మంత్రి రోజా అన్నారు. ఎన్నికలప్పుడు ప్రజలను మోసగించడానికి మాయమాటలు చెబుతాడని, వాటిని నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రభుత్వాన్ని ప్రజలే నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. నగరి ఎమ్మెల్యేగా తనకు, చిత్తూరు ఎంపీగా రెడ్డెప్పకు రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, రూరల్ మండల పార్టీ ప్రెసిడెంట్ గోవిందస్వామి రెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు కొండేటి రామ్మూర్తి, గూళూరు కరుణ, గంగాధరం, నాని, ప్రభురాజు, విజయ్, మస్తాన్, వీరాస్వామి, బాబు, గోవిందరెడ్డి, శివయ్య, కన్నెమ్మ, శివ, అరుణ్, సదాశివం, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న మంత్రి రోజా

మెగా ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

పుత్తూరు: ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం గట్టు గ్రామంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మిత ఆహారం, క్రమం తప్పని వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సూచించారు. 40 ఏళ్లు వచ్చిన ప్రతి ఒక్కరూ ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకుని, తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ విధిగా 45 నిమిషాల పాటు నడవాలని సూచించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికి తరలివచ్చిన తిరుపతి వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. శిబిరంలో 260 మందికి చికిత్స నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు ఏ.ఆర్ముగం, జె.శ్రీధర్‌రాజు, కె.సుభాషిణి, సరేంద్ర, శ్రీహరినాయుడు, ప్రణీత్, శ్రీపతి, నరసింహాలు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గోపికృష్ణ, యుగంధర్‌రాజు, మాధవులనాయుడు, కుప్పయ్య, గుణశేఖర్‌రెడ్డి, గట్టు మోహన్, శివ, రామచంద్రనాయుడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొన్నురంగం సేవలు ఎనలేనివి



పదవీవిరమణ పొందిన పొన్నురంగం దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయుల బృందం

కార్వేటినగరం: ఉపాధ్యాయుడు పొన్నురంగం అందించిన సేవలు ఎనలేనివని మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో కోదండరామాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పొన్నురంగం పదవీవిరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ విజయకుమార్ మాట్లాడారు. కోదండరామాపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పొన్నురంగం ఉపాధ్యాయులకే ఆదర్శమన్నారు. విద్యాబోధనలో పొన్నురంగం జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారని గుర్తు చేశారు. గతంలో ఏటా విద్యార్థులకు పాఠ్యసామగ్రితో పాటు విద్యార్థులకు యూనిఫాం కూడా వితరణ చేసిన ఘనత కూడా పొన్నురంగానిదే అన్నారు. అలాగే నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలను ప్రైవేటు పాఠశాలకు దీటుగా తీర్చిదిద్దడంలో పొన్నురంగం కృషి మరువలేనిదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ బాధ్యతను కూడా ఉపాధ్యాయుడు పొన్నురంగం తీసుకుని విద్యార్థులకు ఎలాంటి లోటు లేకుండా ఉత్తమ బోధనలు అందించారని, ఆయన పదవీ విరమణ పొందడం బాధగా ఉందన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు దంపతులను గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జంప్ జిలానీలదే పెత్తనం

- నాలుగేళ్లు పార్టీ కోసం తాము శ్రమిస్తే.. ఇప్పుడు పార్టీలో చేరిన వారికే విలువ ఇస్తారా ?
- ఆ పార్టీలో వద్దనుకున్న వారు ఇక్కడకు వచ్చిన వారికే పెద్దపీట వేస్తున్న నేతలు ?
- జీర్ణించుకోలేకపోతున్న టీడీపీ నేతలు



నగరి : గత ఎన్నికల తరువాత రాష్ట్రంలో టీడీపీ దాదాపు కనుమరుగైన స్థితికి చేరింది. అయితే అడపాదడపా ఆ పార్టీ చేపట్టే కార్యక్రమాలకు నిజమైన టీడీపీ నేతలు ఖర్చు పెట్టుకుని, అధినాయకత్వం ఆదేశాల మేరకు నిరసనలు, ధర్నాలు వారే ముందుండి చేసేవారు. పార్టీ తరఫున నేతల జయంతి, వర్ధంతి, పుట్టిన రోజు వేడుకలను వారే సొంత డబ్బులు వెచ్చించి నిర్వహించేవారు. అయితే ఇప్పుడు ఎన్నికలు రావడంతో ఇతర పార్టీల నుంచి వచ్చి చేరుతున్న వారే పార్టీలో పెత్తనం చెలాయిస్తుండడంపై పాత కాపులు జీర్ణించుకోలేకపోతున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ ఘోర ఓటమి తరువాత పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిపోయిన కొందరు అక్కడ పదవులు అనుభవించారు. దీనికితోడు వైఎస్సార్‌సీపీ నేతలకంటే ఎక్కువగా టీడీపీ అధినాయకత్వంపై తిట్ల పురాణం అందుకున్నదీ వీరే. ప్రస్తుతం మళ్లీ ఎన్నికలు రావడంతో జంప్ జిలానీలు మళ్లీ స్వార్థ ప్రయోజనాల కోసం టీడీపీలోకి చేరుకున్నారు. అక్కడకు వెళ్లినా పెత్తనమంతా వారిదే ఉండడంతో అప్పటి వరకు టీడీపీలో ఉన్న శ్రేణులంతా వెనుక వరసకు వెళ్లిపోయారు. ఇది ఆ పార్టీలోని పాత కాపులకు మింగుడు పడడం లేదు. ఇన్నాళ్లు పార్టీకి శ్రమించిన వారికి గుర్తింపు లేకుండా పోతోందని మదనపడుతున్నారు. నియోజకవర్గ అభ్యర్థి కూడా ఎక్కువగా వారిపైనే ఆధారపడడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. అక్కడ వద్దనుకుంటే ఇక్కడకు వచ్చిన వారికే పెద్దపీటా? అక్కడ పదవులు అనుభవించి స్వార్థ ప్రయోజనాల కోసం ఇక్కడకు వచ్చిన వారికే అందలాలా అంటూ ద్వితీయ శ్రేణి టీడీపీ నాయకులు మండిపడుతున్నారు.

'వైఎస్సార్‌సీపీ గెలుపే మా సంకల్పం'



మంత్రి భర్త ఆర్‌కే సెల్వమణితో కలిసి అడుగులేస్తున్న సెంగుంధర్లు

- మంత్రి భర్త ఆర్కే సెల్వమణికి సెంగుంధర్ల అపూర్వ స్వాగతం



దివ్యాంగుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న సెల్వమణి

నగరి : ''వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే మా సంకల్పం'' అంటూ మున్సిపల్ పరిధి ఏకాంబర కుప్పంలో సెంగుంధర్లు ప్రచారంలో పాల్గొన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారం నిమిత్తం ఏకాంబర కుప్పానికి వెళ్లిన మంత్రి భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణికి వారు స్వాగతం పలికారు. తొలుత సెంగుంధర్ల ఆరాధ్య దైవమైన సుబ్రమణ్య స్వామిని ప్రార్థించుకున్న ఆయన తన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ ప్రాంతంలోని వారంతా మంత్రి భర్త సామాజిక వర్గానికి చెందినవారు, నేత పరిశ్రమకు చెందినవారు కావడంతో ఆయనపై వారికున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇంటింటికీ వెళ్లిన మంత్రి భర్త ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపే కరపత్రాలను, చేసిన సంక్షేమాన్ని వివరించారు. గత ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేస్తే అభివృద్ధి చేసి చూపుతామని హామీ ఇచ్చామని ఆ మేరకు అభివృద్ధి పనులు చేపట్టామని అది బాధ్యతగా మీకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ''ఇంత నిజాయితీగా వ్యవహరించిన మీకే మా మద్దతు అని, మీ విజయమే మా సంకల్పం'' అని సెంగుంధర్లు ఆప్యాయంగా ఆయనకు తెలియజేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు బీడీ భాస్కర్, భూపాలన్, బాబు, కోఆప్షన్ సభ్యులు ఆనంద్, ఎల్లప్పరెడ్డి, సెంగుంధ సామాజికవర్గం వారు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం



ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని గజమాలతో సన్మానిస్తున్న మహిళలు



గీత కార్మికుడితో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

- అబద్ధాల చంద్రబాబును నమ్మకండి
- ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

పెనుమూరు(కార్వేటినగరం) : పేదల కష్టాలు తెలిసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, వారి అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగించారని జీడీనెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె మండల పరిధిలోని గంగుపల్లె, సాతంబాకం పంచాయతీల్లో సత్యవేడు నియోజకవర్గం పరిశీలకులు, జీడీనెల్లూరు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలుతో పాటు ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షల వరకు పెంచిన ఘనత జగనన్నదేనని గుర్తు చేశారు. అలాంటి పేదల ఆర్థిక బలోపేతానికి తోడ్పాటు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని కోరారు.

గీత కార్మికులతో మాటామంతీ..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి కల్లు గీతకార్మికులను కలిశారు. ఈ సందర్భంగా ఆమె వారితో ముచ్చటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గీత కార్మికులకు 45 ఏళ్లకే పింఛన్ అందించిన ఘనత జగనన్నదేనని అన్నారు. మరోమారు గీత కార్మికులు జగనన్నకే పట్టం కట్టాలని కోరారు.

చంద్రబాబును నమ్మకండి

సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక , పాకిస్తాన్ అవుతుందన్న చంద్రబాబు, నేడు ఓట్ల కోసం అవే సంక్షేమ పథకాలను అందిస్తామని యూటర్న్ తీసుకుంటున్నారని అలాంటి వారిని నమ్మమోసపోవద్దని సత్యవేడు నియోజకవర్గం పరిశీలకులు మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి పిలుపునిచ్చారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు అధికారం కోసం అనేక హామీలు గుప్పించి ప్రజలను మోసం చేశారని విమర్శలు గుప్పించారు.మళ్లీ మాయమాటలతో మభ్యపెట్టేందుకు వస్తున్న బాబుకు ఓటుతో గుణపాఠం చెప్పాలని ప్రజలకు తెలిపారు. ప్రజల వద్దకే పాలన అందిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ క్రమంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. దీంతో గ్రామాల్లో మహిళలు కృపాలక్ష్మికి మంగళహారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలతారెడ్డి, జెడ్పీటీసీ దొరస్వామి, మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి, మాజీ పార్టీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, మండల యువత అధ్యక్షుడు లోకేష్‌రెడ్డి, జిల్లా యువత ప్రధాన కార్యదర్శి గిరిధర్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాము, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, బాలాజీ, రామకృష్ణారెడ్డి, అరుణ, రాజారెడ్డి, నరసింహారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే జగనన్న మళ్లీ రావాలి

- జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి గెలుపు కోసం చెల్లెళ్లు ప్రచారం
- వాడవాడలా తిరుగుతూ ప్రజలతో మమేకం అవుతున్న ఇందిరా ప్రియదర్శిని, ప్రతిభాగాంధీ
- వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ప్రచారం



పద్మసరస్సు ఎస్టీ కాలనీలో దివ్యాంగుడు రాజును పలకరిస్తున్న డిప్యూటీ సీఎం కూతుళ్లు ఇందిరా ప్రియదర్శిని, ప్రతిభా గాంధీ



వృద్ధుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కుమార్తె ఇందిరా ప్రియదర్శిని

కార్వేటినగరం: ప్రజా సమస్యలు తీరాలన్నా, సంక్షేమం కొనసాగాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని, అందుకు అందరూ ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి చెల్లెళ్లు డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, ప్రతిభాగాంధీ పిలుపునిచ్చారు. ఆదివారం వారు మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని పద్మసరస్సు, జగనన్నకాలనీ, బిల్లుదొన్న, గురవరాజుగుంట, విజయమాంబాపురం గ్రామాల్లో ఎంపీపీ లత, సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రజల సమస్యలు వింటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమ సోదరి కృపాలక్ష్మిని, చిత్తూరు ఎంపీగా రెడ్డెప్పను ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

మూడు పార్టీలది మూడు ముక్కలాట..

రాష్ట్రంలో మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి మూడు ముక్కలాట ఆడుతున్నాయని, పొరపాటున వారి మాటలు నమ్మితే రాష్ట్రాన్ని అమ్మేస్తారని ఇందిరా ప్రియదర్శిని, ప్రతిభాగాంధీ అన్నారు. సంక్షేమ పాలన కావాలో, దొంగల పాలన కావాల్లో ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు.

ఊపందుకున్న ప్రచారం

జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి చెల్లెళ్లు ప్రచారానికి రావడంతో మరింత ఊపందుకుంది. ఇంటింటా మంగళహారతులు పట్టి, పూల వర్షం కురిపించి, శాలువలు కప్పి ఆయా గ్రామాల్లో మహిళలు వారికి ఘన స్వాగతం పలికారు. పద్మసరస్సు ఎస్టీ కాలనీలో విద్యుత్ షాక్‌తో దివ్యాంగుడిగా మారిన రాజును పరామర్శించారు. అలాగే అదే గ్రామానికి చెందిన వృద్ధుడితో ముచ్చటించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎంపీటీసీ లక్ష్మమ్మ, వెంకటేష్, సుబ్రమణ్యం, ఆర్ముగం, ధనశేఖర్‌యాదవ్, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మురళి, దాము, మురళిరాయల్, శేషాద్రి, షణ్ముగం, రవిరెడ్డి, గురుమూర్తి, దొరస్వామిరాజు, మార్కండేయులు, మహేష్, మురళీరెడ్డి, రవి, ఢిల్లీ, పయణిరెడ్డి, శివప్రకాష్ మొదలియార్, ధనశేఖర్ మొదలియార్ పలువురు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి



ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

పాలసముద్రం : వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జెడ్పీటీసీ సభ్యుడులు అన్బళగన్, మండల కన్వీనర్ తులసి యాదవ్, పారిశ్రామికవేత్త, సినీ నటుడు, నిర్మాత షణ్ముగం తెలిపారు. ఆదివారం వనదుర్గాపురం పంచాయతీల్లో రైతు భరోసా చైర్మన్ పోలయ్య, పెనుమూరు మార్కెట్ డైరెక్టర్ రమాదేవి, సర్పంచ్ నరసింహరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో కలసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలు అందజేసి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రాజు, వరదరాజు, చిన్నవరదరాజు, సిద్ధమండడి, అరుల్, కుట్టి, ప్రేమ్‌కుమార్, రవిరెడ్డి, పుత్తూరు కేశవరెడ్డి, నరసింహనాయుడు, ప్రకాష్, ఆనందన్, షణ్ముగరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వనదుర్గాపురంలో ప్రచారం చేస్తున్న సినీ నటుడు, నిర్మాత షణ్ముగం